

భారతికి మనస్సు బాగాలేదు.

బయట వాతావరణంవూ బాగా లేదు. వాన కురుస్తోంది.

భారతి వాచీ చూసుకుంది. మూడూ పది. ఇంకా మూడుగంటలన్నా గడవాలి. ఆరూ, ఆరున్నరకి గానీ రాడు ప్రకాశం.

టీ పాయ్ మీది పత్రిక తీసు



# లాటరి

విహారి & శాలివాహన

కుంది. పేజీలు తిరగేయసాగింది.

"పెళ్లి కథ!"

అంతకు ముందే చదివేసిన కథ. టైటిల్ కేసి చూస్తుంటే ఏవేవో ఆలోచనలు ముసురుకోసాగినై.

పెళ్ళి అక్షరాలు చింపిరి చింపిరిగా, చిరిగిన కాగితంలా రాసేడు ఆర్టిస్టు.

భారతి టప్పున పుస్తకం మూసేసింది. సుజాత అంటూ వుండే మాటలు గుర్తుకొచ్చినై. ఆమె అంటూ వుంటుంది. "వైవాహిక

జీవితాలు - తొంభై శాతం చెదలు కొట్టేసిన కాగితాలవంటివే. ప్రేమ వేరు, పెళ్ళి వేరు, దాంపత్యజీవితం వేరు.''

అప్రమితంగా కుర్చీలోంచి లేచింది భారతి.

చూపులు ఎదురింటి కిటికీమీదికి మళ్ళినై. అతను అక్కడే కూర్చుని వున్నాడు. అవే కళ్ళు - పిల్లికళ్ళు. అవే చూపులు - తోడేలు చూపులు. పురుగు కోసం కాచుక్కూర్చున్న బల్లిలా ఉదయంనుంచీ అలాగే చూస్తూ కూర్చున్నాడు.

''ఛీ....ఛీ....ఏం మనుషులో''

భారతి విసుక్కుంది. అప్రయత్నంగా ఆమె కాళ్ళు పక్కకి కదిలినై. వెళ్ళి మంచం మీద పడుకుంది. ఎదురింటి బల్లి కళ్ళముందు మెదిలింది. అతనేంచేస్తూ వుంటాడో ఏమో తెలీదు. వారం రోజులనాడు ఆ గదిలో దిగేడు. ఈ వారం రోజుల్లోనూ అతను గదినుంచి బయటికి వెళ్ళగా తను చూడలేదు. అనంతమైన నిరీక్షణలో కాలం గడుపుతున్నట్టు - ఆ కిటికీ దగ్గరే కూర్చుంటాడు. తనెప్పుడు కనిపిస్తుందా అనే యావతో వున్నట్టుంటుంది అతని వాలకం. తను కిటికీ దగ్గరసా వెళ్లగానే అతని కళ్ళు మెరుస్తాయి. పిల్లి కళ్లు!!

భారతికి ఏంవీ తోచటం లేదు. సుజాతని కూడా సెలవు పెట్టి రమ్మన్నా బాగుండేది. కొంత కాలక్షేపంగా వుండేది. అసలు తనీవేళ అనవసరంగా సెలవు పెట్టింది. తనెంత చెప్తున్నా వినలేదు అన్నయ్య. ''రాక రాక వస్తున్నాడు ప్రకాశం. అత నొచ్చేసరికి కాస్త ఇల్లంతా సర్ది శుభ్రంచెయ్యి. నువ్వూ నేనూ ఉద్యోగాల ధ్యాసలో పడి-వో అందం,పొందికా లేకుండా చేసుకున్నాం యింటిని. అతను మనల్ని, మన ఇంటినీ ఇలాగే చూసేడంటే ఝడుసుకుని పారిపోతాడు. ప్లీజ్. నువ్వివ్వాళ సెలవు పెట్టు. అరింటికల్లా అతనొచ్చేస్తాడు,'' అంటూ వొకటే హడావిడి చేసి సెలవు పెట్టించాడు అన్నయ్య.

తీరా అన్నయ్య ఆఫీసుకు వెళ్ళగానే వర్షం నిన్నటి కంటే ఎక్కువగా దబాయించటం మొదలెట్టింది. ఇల్లంతా సర్ది వొక స్థితికి తెచ్చేసరికి, వొంటిగంట దాటింది. అప్పట్నుంచీ మనస్సులో 'బోర్'. బయట వర్షం!

అంత వర్షంలోనూ ప్రక్కభాగంలో హడావిడి వినిపిస్తోంది.

ఆ యింట్లో పెళ్లి. పప్పులూ, బియ్యం బాగుచేయించటం వంటి

పనులు జరుగుతున్నై.

పదకొండేళ్ల వరలక్ష్మికి పెళ్లి! వాళ్ళ నాన్న ఓ సోమయాజులు గారు. కూతురు రజస్వలా కాక ముందే పెళ్ళి చేయాలని ఆయన పట్టుదల. అలా కాకపోతే, ఆయన శ్రోత్రీకానికి ప్రమాదమొస్తుందిట. అందుకని, తాహతు లేకపోయినా-చందాలు అడుక్కుని ముహూర్తం నిర్ణయించుకున్నాడు. పెళ్లికొడుకు పదిహేడేళ్ళవాడట. సంస్కృతం ఎంట్రన్స్ పరీక్ష రాసేట్ట.

"ఈ కాలంలో కూడా ఇలాంటి పెళ్లిళ్ళు జరగటం చాలా దారుణం" నిన్న అన్నయ్య అన్నాడు.

"ఆ మాటేమోగానీ, నా లాంటి వాళ్లకు పెళ్ళిళ్లు జరక్కపోవటంమాత్రం దారుణంకాదూ?" అని అడగాలనిపించింది తనకు. కాని, అడగలేదు. అడిగితే అన్నయ్య నొచ్చుకుంటాడు. తన మాటని అపార్థం చేసుకుంటాడు. "నీ పెళ్ళికి నేను ప్రయత్నాలు చేయటం లేదా?" అని ప్రశ్నించనూ వచ్చు.

న్యాయానికి తన పెళ్లికోసం చాలా ప్రయత్నాలు చేస్తున్నాడు. ఎన్నోసార్లు తన పెళ్లి చూపులు జరిగిన్నై.

మొన్నటికి మొన్న—

అతను—

అతను—

ఆ హిప్పీ జుట్టు, పెద్ద పెద్ద సైడ్ బరన్స్, కళ్ళజోడు యువకుడు—

మనిషి చాలా సౌమ్యంగా కనిపించాడు. ఏదో కంపెనీలో పని చేస్తున్నాట్ట. ఆరువందలు జీతం. తండ్రి వున్నాడు. ఒక్కడే సంతానం. అతనికి తను నచ్చినట్టు తెలిసింది. సంబంధం ఖాయమనే అన్నాడు అన్నయ్య.

కానీ, ఆ రాత్రి—

అన్నయ్య యింటికొస్తూనే ధూముధాములతో వచ్చాడు.

అరగంట తర్వాత తెలిసింది. హిప్పీ జుట్టు ఫ్రెండ్సతో వెకిలి కులూ, చెవాకులూ మాట్లాడుతూ బార్‌లోనుంచి బయటికొస్తుంటే చూశాట్ట అన్నయ్య.

"తాగుబోతు వెధవ, వాడికి నువ్ నచ్చగానే సరా? వాడు మనకు నచ్చక్కర్లే దనుకున్నాడు. రోగ్. ఈ సంబంధం చేసి, చూస్తూ చూస్తూ నీ గొంతు కొయ్యలేను భారతీ." అన్నాడు అన్నయ్య గద్గదికంగా.

ఆ మర్నాడు సుజాత అన్నది. ఇదంతా విని. "పెద్దగా పట్టించుకో వాల్సిన విషయం కాదు భారతీ

యిది. ఎందుకంటే ఏదోక బల హీనత ప్రతి మనిషిలోనూ వుంటుంది. సరిపెట్టుకోవలసిన ఘనత మనలో కావాలి."

నెలరోజుల క్రితం—

వేదాలు చదువుకుంటున్న ఎమ్మే పబ్లిక్ ఎడ్మినిష్ట్రేషన్ వచ్చాడు. అతను తనని ఒకే ఒక్క ప్రశ్న వేశాడు

"మీరు ఉద్యోగం చేస్తున్నారు గదా. న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి అన్నారు మన పెద్దలు. మీ ఉద్దేశ్య మేమిటి?"

"నీ నెత్తిన వో మొట్టికాయ వెయ్యాలనిపిస్తోంది"— అనాలనిపించింది. కానీ అనలేదు.

అన్నయ్య తనేం సమాధానం చెప్తుందోనని ఆందోళనగా తన వైపు చూసేడు. అప్పుడప్పుడూ తను చెప్పే సమాధానాలు చురుగ్గా వుంటాయని వాడికి తెలుసు.

కొద్ది క్షణాలు తటపటాయిస్తున్నట్టు నటించి చెప్పింది తను, "నాకేం ప్రత్యేకమైన వుద్దేశ్యాలు లేవండి."

అతని కళ్లు విప్పారినై.

అన్నయ్య తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు.

వేదాలు చదువుకుంటున్న ఎమ్మే కాలర్ సరిచేసుకుని, 'రైటో' అన్నట్టు వింత భంగిమలో కదిలాడు.

"ఉద్యోగం చేసి డబ్బు తెస్తానంటుంటే-వద్దు. చేదు మేస్తాననే వాణ్ణి మనమేం చేస్తాం. వద్దంటే మానేసి హాయిగా ఇంట్లో కూర్చుందువుగాని" అన్నాడు అన్నయ్య.

తన అభిప్రాయాలేవీ బయట పెట్టలేదు తను.

ఆ తర్వాత ఆ సంబంధం వదులుకున్నాడు అన్నయ్యే. వేదాలు చదువుకుంటున్న ఎమ్మేకి పల్మనరీ టి. బి వుందిట!

సుజాతకి ఎమ్మేగారి అభిప్రాయం చెప్తే తేలిగ్గా నవ్వేసి అన్నది, "పిచ్చి మొద్దు! అతని అభిప్రాయం వెనుక పెళ్ళాన్ని కష్టపెట్టకూడదనే వుందని ఎందుకనుకోకూడదు? నీ స్వేచ్ఛని అరికట్టున్న అహం మాత్రమే వుందని ఎందుకనుకోవాలి?"

తను ఎటూ ఆలోచించలేకపోయింది. ఇంతలో అన్నయ్య 'నెగిటివ్' నిర్ణయం తెలియనే తెలిసింది.

ఏడాది క్రితం—

మరో పెద్దమనిషి గురించి విన్నది. వయస్సు ముప్ఫైరెండు. ఆయనకి పెళ్ళయిన అయిదేళ్ళకే

పెళ్ళాంపోయిందట.ఆమె వయస్సు ఇరవై నాలుగుట.అన్నయ్య ఆయన వుద్దేశ్యమేఁవీ చెప్పకుండా— తనని అడిగాడు.

"నీ యిష్టం" అన్నది తను.

"వద్దు భారతీ. నాకీ సంబంధం యిష్టంలేదు. రెండో పెళ్ళివాడనీ, పిల్లలున్నారనీ కాదు. నిజానికి అతనికి పెద్ద వయస్సూ లేదు. ఉన్న పిల్లల్నేమో అతని అత్త గారూ, వాళ్ళు చూస్తారట కూడా. కానీ, పెళ్ళయిన అయిదేళ్ళకే నలుగురు పిల్లలు కలిగేరంటే"- అని అర్ధోక్తిలో ఆపేశాడు అన్నయ్య.

అన్నయ్య భావం నేను గ్రహించాను. ఏఁవీ మాట్లాడలేదు.

ఈ విషయం విని, విరగబడి నవ్వింది సుజాత."మీ అన్నయ్య మనస్తత్వంచిత్రంగా వుందే.అదొక కాంప్లెక్స్. పెళ్ళయిన ఐదేళ్ళకే నలుగురు పిల్లలు కలగటంలో అతని కెంత బాధ్యత వుందో,అతని భార్యకూ అంతే బాధ్యత వుందనే వాస్తవాన్ని ఎందుకు గ్రహించటం లేదు నువ్?" అని సూటిగా ప్రశ్నించింది.

తన దగ్గర సమాధానం లేదు.

క్షణాల తర్వాత సుజాతే అన్నది "ఈ యుగంలో ఏ శ్రీశుకుడో, శ్రీరామచంద్రుడో భర్తగా రావాలనే ఆశలు, కలలు వుండటం వొంటికి మంచిది కాదు భారతీ. ప్రొక్రాస్టినేషన్ ఈజ్ నో గుడ్."

ఏ నిర్ణయానికీ రాలేని స్వభావం చెడ్డది-నిజమే. అన్నయ్య దగ్గర ఈ దౌర్బల్యం బాగానే వుంది. మరి తన మాటేమిటి? తను వొక నిశ్చయానికి రావచ్చుగా? ఇలా ఆలోచన, పునరాలోచన, పునశ్చరణ—తో ఏళ్ళు గడుస్తున్నై.

ఏళ్ళు తలపుకొచ్చేసరికి తన వయస్సు సంగతి గుర్తు కొచ్చింది భారతికి. బియ్యే పాసయ్యే ఎనిమిదేళ్ళు!

రెండేళ్ళ క్రితం జరిగిన సంఘటన స్ఫురణ కొచ్చింది భారతికి.

ఓసారి,

బియ్యేస్సీ పాసై, వ్యవసాయం చేసుకుంటున్న వరుడు పెళ్ళి చూపుల కొచ్చేడు. అతను వచ్చిన ప్పట్నుంచీ వెళ్ళే వరకూ మాట్లాడుతూనే వున్నాడు. రాజకీయాల నుంచీ ఎరువుల్లో రకాలదాకా అన్ని అంశాలూ స్పృశించాడు.

అన్నయ్యకి అతనూ నచ్చలేదు

"వట్టి 'చాటర్‌బాక్స్'. నువ్ గమనించావో లేదో గానీ అతనికో కాంప్లెక్స్ వుంది. తను వ్యవ

పాయం చేస్తున్నా ఎంతో లోక జ్ఞానం, జనరల్ నాలెడ్జ్ కలిగిన వాణ్ణి ఇతరులకు తెలియజేయాలనే తరద ఎక్కువ పాపం, వాణ్ణి కట్టుకుని మూగదాని వేమైపోతావ్ గానీ—వద్దులే" అన్నాడు

తన పెళ్ళిచూపుల దృశ్యాలన్నీ ఎప్పటికప్పుడు తెలుస్తూనే వుంటయ్— సుజాతకి. ఆమె ఆ రోజున అన్నది,

"అతని వాగుడంతా మౌనంగా వింటూ, లోలోపల నవ్వుకోవడంలో కూడా ఓ "ప్లెజర్" వుంటుంది, దాన్ని నువ్వివ్వాళ ఊహించలేవులే."

"అవును. నేను ఏదీ ఊహించలేకపోతున్నాను. ఏదీ ఊహించలేకుండా వుండలేక పోతున్నాను" అనిపించింది.

భారతికి చిరాకేసింది.

మంచంమీదనుంచి లేచింది. బాత్‌రూమ్‌కేసి వెళ్ళింది.

—స్నానంచేసి ముస్తాబై, హాల్లో కొచ్చేసరికి ఐదూ ఇరవై అయింది.

ఉదయం పాలు వున్నాయనే విషయం గుర్తుకొచ్చింది. వంటగదిలోకి వెళ్ళి కాఫీపెట్టుకుని త్రాగింది.

మనస్సు తేలికపడినట్లయింది.

హాల్లోకొచ్చి పడక కుర్చీలో కూర్చుంది.

కిటికీకేసి చూపులు మరలినై. ఎదురింటి బల్లి అలాగే వుంది; వాన కురుస్తూనేవుంది. సీనారేకు సన్‌షేడ్‌మీద చినుకులు పడుతూనే వున్నై.

కిటికీ తలుపులు మూసేసింది భారతి. బయట ముసురువల్ల లోపల చీకట్లు క్రమ్మింది. లైట్ వేసింది.

ప్రకాశం కళ్ళముందు మెదిలాడు.

ఎప్పుడో ఆరేళ్ళక్రితం ప్రకాశాన్ని చూసింది తను-ఆవేళ.

అన్నయ్య,తనూ కలసి హైదరాబాద్ వచ్చేస్తుండగా తమతోపాటు ఒంగోలుదాకా వచ్చేడు ప్రకాశం. రాత్రి పదింటినుంచీ ఒంటిగంటదాకా బస్‌స్టాండులో కూర్చున్నారు—ముగ్గురూను.

అన్నయ్యతో అన్నాడు ప్రకాశం, "ఏరా మూర్తి — భారతికీ ఉద్యోగం వచ్చింది. మీరిద్దరూ ఒకే వూళ్ళో ఉద్యోగాలుచేస్తూ హాయిగా రోజులు గడిపేస్తారు, నేనే ఏ బోగినీ పట్టుకోలేక గుండ్లకమ్మ గట్టున కలలుకంటూ కూర్చుండి పోతున్నాను, ఇంకా ఎన్నాళ్లో ఈ గడ్డు రోజులు,"

"అక్కడే ఏదైనా ప్రయత్నం చెయ్యొచ్చు. విన్న మాతో

రమ్మంటే రానంటుంటివి"— అన్నయ్య.

"మనమెంత మంచిపని చేస్తున్నా—ప్రపంచానికి వెరవటం ముఖ్యంరా మూర్తీ. భారతివున్న చోటికి నేనూ చేరటం—ఎవ్వరికీ మంచిదికాదు...."ప్రకాశం ఎటో చూస్తూ అన్నాడు.

"మా ఉద్యోగాలకంటే నీకు తప్పకుండా మంచి ఉద్యోగం వస్తుంది బావా" అంది తను భవిష్యత్తు మీద గంపెడాశతో.

"నీ మనస్సు మీద, నీ మాట మీద నాకు చాలా నమ్మకం భారతీ" ప్రకాశం తన కళ్ళల్లోకి చూసేడు. అతని కళ్ళు మెరుస్తున్నై. అతని చూపుల్లో తన పట్ల ఏదో ఆరాధన, ఆత్మీయత, గౌరవభావం కనిపించింది.

క్షణాల తర్వాత తనే చూపులు మరల్చుకుంది.

ఆ తర్వాత,

రెణ్ణెల్లకి బ్యాంకులో ఉద్యోగం వచ్చింది ప్రకాశంకి. అతని మకాం మద్రాసుకు మారింది. అప్పట్నుంచీ మళ్ళీ ప్రకాశంని కలుసుకోవడమే పడలేదు.

తను ఉద్యోగంలో చేరిన కొత్తల్లో వో రోజు అన్నయ్య అడిగాడు, "బావ గురించి నీ అభిప్రాయమేఁవిటి భారతీ?" అని.

తనకేఁవీ ప్రత్యేకమైన అభిప్రాయాలు లేవన్నది తను. తన పెళ్ళి గురించి ప్రయత్నాలు ప్రారంభించాడు అన్నయ్య. తనకు వేరే సంబంధాలు చూడటం మొదలెట్టగానే, ప్రకాశం గురించి అన్నయ్య అభిప్రాయం అవగతమైంది తనకు. ప్రకాశంతో తన పెళ్ళి అన్నయ్యకు యిష్టంలేదన్నమాట.

ఇన్నాళ్ళకు ప్రకాశం తమని కలుసుకోవడానికి వస్తున్నాడు. అతనిప్పుడు ఆఫీసరయ్యాట్ట.

తలుపు తట్టిన శబ్దానికి ఉలిక్కిపడి, ఆలోచనలోనుంచి తేరుకుంది భారతి. తలుపు తీసింది.

ఎదురుగా మూర్తీ, ప్రకాశం.

"ఉద్యోగినిగా రేమంటున్నారు?" చిరునవ్వుతో లోపలికొచ్చాడు ప్రకాశం. వెనగ్గా మూర్తి వచ్చాడు.

"ఆఫీసరుగా రెలా వున్నారు?" అంది భారతి.

"ప్రశ్నకు ప్రశ్నే జవాబు చేసే అలవాటు పోలేదే నీకింకా" అంటూ నవ్వేడు ప్రకాశం.

ముగ్గురూ కూర్చుని ముచ్చట్లలో పడిపోయారు. సంభాషణ పెళ్ళి విషయాల మీదికి మళ్ళింది. భారతికి సంబంధాలు చూస్తున్న

సంగతీ, ఏ వొక్కటీ అంతనా పొంతనా కుదరక నచ్చటం లేదనే సంగతీ చెప్పేడు మూర్తి.

"అయితే అమ్మాయిగారికి నచ్చే వరుడే తటస్థపడలేదన్న మాట" ప్రకాశం భారతిని ఉలికించే ధోరణిలో అన్నాడు.

"ఆ నింద మాత్రం వెయ్యకు. నాకు నచ్చటమో, నచ్చకపోవడమో తేల్చుకొనేలోగా — అన్నయ్యే కాన్సిల్ చేసి పారేస్తున్నాడు" అంది భారతి.

"ఒప్పుకుంటాను. పాపమో పుణ్యమో అదంతా నామీదగానే పోనియ్యండి." అని నవ్వి, "అయినా పెళ్ళి విషయాల్లో తొందర పడటం మంచిది కాదని నా అభిప్రాయం. అన్నీ ఆలోచించిగాని ఓ నిర్ణయం తీసుకోకూడదు." అన్నాడు మూర్తి.

"పెళ్లి విషయాల్లో జాగ్రత్త పడవలసిన మాటనిజమే అయినా, కొంత రిస్క్ తీసుకోక తప్పదు. సినిమాల్లో హీరోగా చేరదామని కోటి కలలతో, కొండంత ఆశతో వెళ్తాడు. అతన్ని మనం విలన్ డెన్‌లో వో సిపాయిగా తుపాకీ పుచ్చుకు నిలబడే వాడి వేషంలో చూస్తాము. అలాగే పెళ్లి విషయం కూడా. కలలు, ఆశలూ-ఏవేవో వూహిస్తాము. తీరా వాస్తవ జీవితంలో ఫిఫ్టీ-ఫిఫ్టీ ఛాన్స్! అందుకు సిద్ధపడితే ఆ తర్వాత ఆవేదన, నిరాశ, నిస్పృహలు వుండవు."

భారతి మంత్రముగ్ధలా వింటూ కూర్చుంది.

ప్రకాశం మాటలు సుజాత మాటల ధోరణికి అతి దగ్గరగా వున్నై. అంటే—వీళ్ళు చెప్పే దాన్ని బట్టి-జాగోగుల నిర్ణయంలో కొంత రిస్క్ తప్పదనేనా!

ప్రకాశం మాటల్ని సుజాతతో చెప్తే ఏఁవంటుందో చూడాలి అనుకుంది భారతి.

అప్పుడు మూర్తి అడిగేడు, "సిద్ధాంత పాఠాలు చెప్తున్నావ్ గానీ, మరి నీ పెళ్లెప్పుడు?"

ప్రకాశం ముఖ కవళికలు మారినై. చూపులు మరల్చుకుంటూ అన్నాడు, "నా కెవడు పిల్లనిస్తారోయ్."

మూర్తి దెబ్బతిన్నాడు. భారతికీ బాధ కలిగింది. తమను దెప్పి పొడుస్తూనే ఆ మాట అన్నాడని ఇద్దరూ గ్రహించారు.

క్షణాల తర్వాత ప్రకాశమే అన్నాడు, "బహుశా ఈ ఏడాది లోనే జరగొచ్చు"

—ఆ రాత్రి భారతికి నిద్రపట్టలేదు.

పెళ్ళి కథ. పదకొండేళ్ళ వరలక్ష్మి. ఆమె పదిహేడేళ్ళ వరుడు గుర్తుకొచ్చేరు.

సుజాత మాటలు చెవినిల్లు కట్టుకుని వేధించ సాగినై.

'—ఏదో ఒక బలహీనత ప్రతి మనిషిలోనూ వుంటుంది. సరిపెట్టు కోవలసిన ఘనత మనలో కావాలి.

—'ఈ యుగంలో ఏ శ్రీశుకుడో, శ్రీ రామచంద్రుడో భర్తగా రావాలనే ఆశలు. కలలు వొంటికి మంచిదికాదు భారతీ.'

ప్రకాశం మాటలూ తలపు కొచ్చేయి.

—"పెళ్ళి విషయంలో కొంత రిస్క్ తీసుకోక తప్పదు."

ఇంతకాలం తనకు అన్ని విధాలా చాలా మంచి సంబంధం చూడాలనే అన్నయ్య తాపత్ర యానికి తనూ ఉదాసీనత వహిం చింది. కాని, ఈ విషయాలన్నీ ఆలోచిస్తుంటే సుజాత చెప్పినట్లు "ఆలస్యం చేయుట మంచిది కాదు" అనే అనిపిస్తోంది.

ఆలోచనలతో సతమతమైన మేధస్సు నిద్రని ఆహ్వానించింది.

—మర్నాడు,

సుజాతతో చాలాసేపు మాట్లా డింది భారతి.

భారతి చెప్పిందంతా విని అన్నది సుజాత. "ఒక్కమాట చెప్తాను ఆలోచించు భారతీ. పెళ్లి ఒక లాటరీ. ఎంత చదివిన ఆడ దైనా, ఎంత డబ్బున్న ఆడదైనా, ఎంత తెలివీ, అందం గల ఆడ దైనా—ఆ లాటరీలో అదృష్టాన్నే వరిస్తుందని ఘంటాపథంగా చెప్ప లేము. మనసుకు తోచిన టికెట్ కొనెయ్యటమే!"

అప్పుడు భారతి చాలా సీరి యస్‌గా ఆలోచించింది.

ఎదురింటి బల్లి—

హిప్పీ జుట్టు—

వేదాలు చదువుకుంటున్న ఎమ్మే—

రెండో పెళ్లికి తయారైన నలుగురు పిల్లల తండ్రి—

వ్యవసాయం చేసుకుంటున్న బియ్యేస్సీ—

అంతా కళ్లముందు మెదిలేరు!

అన్ని టిక్కెట్లూ కళ్లముందు తిరిగినై!

ఒక నిశ్చయానికి వచ్చిన తర్వాతే ఇంటికి చేరింది.

ఆ సాయంత్రం,

సినిమా ప్రోగ్రాం వేశారు. తీరా ఆ సమయానికి వో స్నేహితుడికి వీడ్కోలివ్వాలని వెళ్ళిపోయాడు

మూర్తి. ప్రకాశం, భారతీ బయ ల్దేరారు.

థియేటర్‌లో,

సినిమా జరుగుతోంది. ప్రేయసీ ప్రియులు డ్యూయెట్ పాడుతు న్నారు. "నువ్వెవరినైనా ప్రేమిం చావా?"— తమకంతో అడిగింది భారతి.

ఆమెకేసి అదోలా చూసి, "పూర్వం"అన్నాడు ప్రకాశం.

"ఇప్పుడు?"

"ప్రేమించడమనేది ఇన్నిసార్లు జరగదు భారతీ. ఒక్కసారే జరుగు తుంది. ఆ పైన మరే సంభవాలు అనుభవంలోకొచ్చినా అవన్నీ "లస్ట్"కోసం చేసే పనులు. నేను ఒకేపిల్లను ప్రేమించాను. కాని, ఆమెకు నేను నచ్చలేదు." పగిలిన కంఠంతో బరువుగా అన్నాడు ప్రకాశం.

భారతి తడబడింది. ప్రొద్దు ట్నుంచీ ఆలోచించి, ఆలోచించి ఒక నిశ్చయాని కొచ్చింది తను. తీరా ఆ నిర్ణయాన్ని ప్రకాశంతో చెబుదామని వస్తే— భగ్న ప్రేమి కుడిలా మాట్లాడుతున్నాడు అతను.

'ఇతనితో దాంపత్యం....?' భారతి మనస్సు సందేహించింది. కాని, అంతలోనే సుజాత మాటలు వెన్ను దట్టినై. "పెళ్ళి ఒక లాటరీ. మన సుకు తోచిన టికెట్ కొనెయ్యా టమే"—

సంభ్రమంతో, సిగ్గుపడుతూ తక్కున చెప్పింది భారతి—

"నీకు అభ్యంతరం లేకపోతే నేను నీదాన్నవుతాను బావా."

ప్రకాశం నివ్వెరపోయాడు. మెరుస్తున్న కళ్ళతో భారతికేసి చూసేడు, ఆమెచేతిని తనచేతిలోకి తీసుకుని గట్టిగా నొక్కేడు. "అయాం లక్కీ" అన్నాడు.

"ఐటూ" అంది భారతి.

"పూర్వం నేను ప్రేమించా నన్న పిల్ల భారతి!" ఆమె చెవుల్లో గుసగుసలాడేడు ప్రకాశం.

ఇప్పుడు భారతి విస్తుపోయింది. ఆమె మనస్సు ఆనందంతో ప్రపుల్లమైంది.

నెలరోజుల తర్వాత,

ఓరోజు,

సుజాత భారతిని అడిగింది, "పోలియో ఎఫెక్ట్ అయిన బావ గారి ఎడమకాలు ఏమంటున్నది?" అని, "లాటరీ కొట్టేసే మంచి టిక్కెట్టే కొన్నావ్ మొత్తానికి" అంది.

సిగ్గుతో, చిరుకోపంతో సుజా తని మిర్రిమిర్రి చూసింది భారతి! *